# బీమాతో రైతన్నకు ధీమా

## మరణించిన రైతు కుటుంబాలకు రూ.5లక్షల ఇన్సూరెన్స్

ఒక్కో రైతుకు రూ.**2,271.50** ప్రీమియం చెల్లిస్తున్న రాష్ట్ర సర్కారు

సూర్యాపేట జిల్లాలో **3,673** మంది రైతు కుటుంబాలకు రూ.**183.65** కోట్లు..

బాధిత కుటుంబాలకు ఆసరా అవుతున్న బీమా సొమ్ము



తిరుమలగిరి, నవంబర్ 15 : సమైక్య పాలనలో రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఆనాడు అన్నదాత కండ్లల్లో కన్నీరు తప్ప.. పొలాల్లో చుక్క నీరు కనిపించలేదు. పంటలు పండక, చేసిన అప్పులు తీరక వ్యవసాయం భారంగా మారి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతు చనిపోతే కనీసం పలుకరించే నాథుడే లేకుండె. దాంతో అన్నదాతలు వ్యవసాయాన్ని వదిలి పొట్టకూటి కోసం వలస బాట పట్టారు. కానీ.. స్వరాష్ట్రంలో రైతుల కండ్లల్లో ఆనందం చూడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన రైతు కుటుంబాలు వీధిన పడకుండా రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించాలని నిర్ణయించారు. పట్టాదారు పాస్‌పుస్తకం ఉండి 18 నుంచి 59 సంవత్సరాల్లోపు రైతులకు ఉచితంగా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించారు. 2018 ఆగస్టు 15న రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఒక్కో రైతు పేరిట ఏడాదికి 2,271.50 రూపాయల ప్రీమియం చెల్లిస్తున్నది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,673 మంది రైతులు మృతిచెందగా.. వారి కుటుంబాలకు రూ.183.65 కోట్ల రైతు బీమా సొమ్ము అందింది. దీంతో ఆయా కుటుంబాలు సంతోషంగా జీవనం సాగిస్తున్నాయి.

### అన్నదాత కుటుంబాల తల రాత మార్చిన రైతు బంధు, బీమా

రైతు బంధు, రైతు బీమా పథకాలు అన్నదాతల తలరాత మార్చాయి. తెలంగాణ రైతుకు పెట్టుబడి కష్టాలు పోవాలె. వ్యవసాయం పండుగ కావాలెనని ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బంధు పథకం ద్వారా ఎకరానికి రెండు కార్లు కలిపి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఈ డబ్బును సీజన్‌కు ముందే రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తుండడంతో పెట్టుబడి కష్టాలు లేకుండా సంబురంగా సాగు చేసుకుంటున్నారు. గతంలో సీజన్ వచ్చిందంటే చాలు.. రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగాల్సి వచ్చేది. అదునుకు డబ్బులు అందక పదను పోయినంక విత్తనాలు విత్తి దిగుబడి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయేవారు. స్వరాష్ట్రంలో పెట్టుబడి సాయం అందుతుండడంతో రైతులు పండుగలా వ్యవసాయం చేసుకుంటున్నారు.

### బాధలో ఉన్నప్పుడు రైతు బీమా ఆదుకున్నది



అప్పుల బాధలో ఉన్నప్పుడు దురదృష్టం వెంటాడింది. నా భర్త ధరావత్ రాములు అనారోగ్యంతో చనిపోయాడు. ఎటుచూసినా గట్టెక్కె దారి కనిపించలేదు. అప్పులు ఎట్ల తీరాలి దేవుడా.. అని బాధపడుతున్న సమయంలో రైతు బీమా రూపంలో రూ.5 లక్షలు వచ్చినయి. ఆ డబ్బుతో అప్పులు తీరినయి. పాప పెండ్లి చేసిన. బాధలో ఉన్న సమయంలో రైతు బీమా మమ్ములను ఆదుకున్నది. కేసీఆర్ సారు మాకు దేవుడైండు.

– ధరావత్ విమల, కోట్యానాయక్‌తండా, తిరుమలగిరి మండలం

### బీమా డబ్బులు బిడ్డ పెండ్లికి అక్కరకొచ్చినయి



అప్పులు తెచ్చి మొదటి బిడ్డ పెండ్లి చేసినం. ఆ తర్వాత కొద్ది రోజులకే నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. మాకు కొద్దిపాటి వ్యవసాయం ఉన్నది. దాంతో రైతు బీమా కింద రూ.5 లక్షలు వచ్చాయి. ఆ పైసలతో అప్పులు తీర్చుకొని రెండో బిడ్డ పెండ్లి చేసిన. రైతు బీమా డబ్బులు అనుకోని విధంగా సాయపడ్డాయి. అవి రాకుంటే నా కుటుంబం ఇబ్బందుల పాలయ్యేది. ముఖ్యమంత్రి కేసీఆర్ సాయం మరువరానిది.

– యలకంటి రేణుక, వర్ధమానుకోట, నాగారం మండలం

### రైతు బీమా ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



నా భర్త వెంకన్న అనారోగ్యంతో మృతిచెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి బాధలో ఉన్న మాకు 18 గుంటల వ్యవసాయ భూమి ఉంది. అది అమ్మినా కష్టాలు తీరే పరిస్థితి లేదు. ఆ సమయంలో అనుకోకుండా మాకు రైతు బీమా రూపంలో 5 లక్షల రూపాయలు వచ్చినయి. ఆ పైసలతో అప్పులు తీర్చుకొని నా ఇద్దరు బిడ్డల కోసం రెండు ప్లాట్లు కొన్నా. రైతు బీమా ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– కొండగడపల రమ, వెంపటి, తుంగతుర్తి మండలం

# మహిళా ఆరోగ్యానికి సర్కారు భరోసా

## ఆరోగ్య మహిళా కార్యక్రమానికి విశేష స్పందన

- నియోజకవర్గానికో పీహెచ్‌సీ ఎంపిక
- ప్రతి మంగళ వారం ఉచితంగా వైద్య పరీక్షలు
- రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు
- నేరేడుచర్ల పీహెచ్‌సీలో ఇప్పటి వరకు 1,745 మంది మహిళలకు పరీక్షలు

నేరేడుచర్ల, నవంబర్ 15 : మహిళల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. వారికి స్థానికంగానే పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్యం అందించేందుకు ఆరోగ్య మహిళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

నియోజకవర్గానికి ఒక పీహెచ్‌సీని ఎంపిక చేసి ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన వస్తున్నది. నేరేడుచర్ల పీహెచ్‌సీలో ఈ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఈ నెల 7 వరకు 1,745 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ముందస్తుగా వ్యాధిని గుర్తించి రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఉచితంగా 8 రకాల పరీక్షలు

ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో నేరేడుచర్ల పీహెచ్‌సీని ఎంపిక చేశారు. ఇక్కడ ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా క్యాన్సర్ నిర్ధారణ, యురినరీ, ట్రాక్ట్ ఇన్ఫెక్షన్, రుతుస్రావం, బరువు పెరుగడం, తగ్గడం, ఎనీమియా, షుగర్, కిడ్నీ, రక్తహీనత, థైరాయిడ్, పోలిక్ యాసిడ్, ఐరన్ లోపం, విటమిన్ డి, విటమిన్ డి–12 వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు అందిస్తున్నారు.



నేరేడుచర్ల పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కేంద్రానికి హాజరైన మహిళలు (ఫైల్)

### పైసా ఖర్చు లేకుండా వైద్య పరీక్షలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళవారం పీహెచ్‌సీలో చేపట్టే ఆరోగ్య మహిళా కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నది. పైసా ఖర్చు లేకుండా వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తుండడంతో మహిళలు స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రతి మంగళవారం సుమారు 50 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు నేరేడుచర్ల పీహెచ్‌సీ ద్వారా 1,745 మందికి పరీక్షలు చేశాం.

– సాహితి, జిల్లా మలేరియా నివారణ అధికారి

### 1,745 మందికి వైద్య సేవలు

ఆరోగ్య మహిళా కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 8న శ్రీకారం చుట్టింది. నాటి నుంచి ఈ నెల 7వరకు నేరేడుచర్ల పీహెచ్‌సీలో 1,745 మంది మహిళల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. ఇందులో అనుమానం ఉన్న 809 మంది రక్త నమూనాలను జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించారు. వీరిలో ఇద్దరికి బ్రెస్ట్ క్యాన్సర్, ఒకరికి థైరాయిడ్, మరొకరికి గర్భసంచి ముఖ ద్వారానికి క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. వారికి పైసా ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్నారు. ఈ నెల 7న మంగళవారం ఒక్కరోజే 50మంది మహాళలకు పరీక్షలు నిర్వహించి అనుమానం ఉన్న 25 మంది రక్త నమునాలను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించారు. మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం, మందులు అందజేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోలేదని, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని మహిళలు పేర్కొంటున్నారు.